క్లుప్తంగా

కరోనాతో అప్రమత్తం


పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ హారికా గుప్తా

తాళ్లపూడి: కరోనా మళ్లీ విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజలంతా ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలని, ఆ దిశగా ప్రజలకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తగిన సూచనలివ్వాలని సంబంధిత ఉన్నతాధికారులు ఆదేశించినట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి హారికా గుప్తా తెలిపారు. గురువారం పీహెచ్‌సీలో ఆమె మాట్లాడుతూ ప్రజలందరు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నామన్నారు. ముఖ్యంగా జనం ఎక్కువగా తిరిగే షాపింగ్ మాల్స్‌కు వెళ్లడం తగ్గించాలని, ఎయిర్‌పోర్ట్, రైల్వే స్టేషన్ వంటి చోట్లకు వెళ్లినప్పుడు మాస్క్ తప్పనిసరిగా వినియోగించాలని, వృద్ధులు, గర్భవతులు ఇంటి వద్దనే ఉండాలని, స్వల్పంగా జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, వాసన, రుచి కోల్పోవడం వంటి లక్షణాలు ఎదురైతే దగ్గరలోని వైద్య నిపుణులను కలవాలని, ఏ మాత్రం అనారోగ్య లక్షణాలున్నా ఇల్లు దాటి బయటకు రావద్దని సూచించారు.

ఎండీయూల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేయాలి

నిడదవోలు: ప్రజలకు నిత్యావసరాల పంపిణీ చేసే ఎండీయూ వ్యవస్థను రద్దు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జువ్వల రాంబాబు గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిడదవోలులో ఆయన మాట్లాడుతూ ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేయడంతో పాటు రేషన్ వద్ద కూడా సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఎండీయూ వ్యవస్థలో అవినీతి జరిగితే చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అందించే సేవలు రద్దు చేయడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సన్న బియ్యంతో పాటు కందిపప్పు, చింతపండు, నూనె రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయాలన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి మృతి


కొమ్మిరెడ్డి సత్యనారాయణ

దేవరపల్లి: మండలంలోని త్యాజంపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కొమ్మిరెడ్డి సత్యనారాయణ(65) గురువారం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. 2020 నుంచి 2023 వరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సొసైటీ అధ్యక్షుడిగా పనిచేసి సొసైటీ అభివృద్ధికి కృషి చేశారు. పెట్రోలు బంకు స్థాపనకు కృషి చేశారు. రైతు కుటుంబానికి చెందిన సత్యనారాయణ సొసైటీ ద్వారా రైతులకు ఉత్తమ సేవలు అందించారు. సత్యనారాయణకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మాజీ మంత్రి వేణు పరామర్శ


పట్టాభిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి వేణు

కడియం: పితృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు శాక పట్టాభిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ గురువారం పరామర్శించారు. కడియంలో ఆయన స్వగృహానికి వెళ్లి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వేణు వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, ఈలి గోపాలం తదితరులు ఉన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

కడియం: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి రమ్యశ్రీ వైద్య ఖర్చుల కోసం వెలుగుబంటి యూత్ ఆధ్వర్యంలో రూ.5 వేలు అందజేశారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ చేతుల మీదుగా గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక యువత పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో మట్టికి ప్రత్యామ్నాయాలు

కడియం: నర్సరీ రంగంలో మొక్కల పెంపకానికి వినియోగిస్తున్న మట్టికి ప్రత్యామ్నాయాలు ఉన్నాయని కేరళకు చెందిన డాక్టర్ సీఎస్ మనోజ్ అన్నారు. సాయిల్ లెస్ మీడియాని స్థానిక రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, పాలకవర్గం దృష్టి సారించింది. దీనిలో భాగంగా దేశ వ్యాప్తంగా సాయిల్ లెస్ మీడియాల తయారీలను పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోకోపిట్, రైస్ రస్క్, పీట్‌మాస్ తదితర వాటిని మట్టితో కలిపి ఇప్పటికే రైతులు వినియోగిస్తున్నారు. పూర్తిగా సాయిల్ లెస్ విధానంలో మొక్కలు సాగుచేసేందుకు తగిన మీడియాను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కేరళకు చెందిన డాక్టర్ మనోజ్, బృందం, సభ్యులు చర్చించారు. పైలెట్ ప్రాజెక్టుగా స్థానికంగా రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కొండేపూడి నాగు, రత్నం బాబ్జీ, పిల్లా శ్రీనివాస్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొనుగోడు పట్టించుకోరూ!

- చేలగట్లు, రోడ్ల పక్కన ధాన్యపు నిల్వలు
- ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అయిన కాడికి అడుగుతున్న దళారులు
- మండలంలో 5 వేల టన్నుల నిల్వలు
- అధికారులు చెప్పున్నది 3,500 టన్నులు


ఖండవల్లిలో ఆర్అండ్‌బీ రోడ్డుపై ధాన్యం రాశి


ఉమ్మిడివారి పాలెం వెళ్లే రహదారిలో ధాన్యం రాశులు

పెరవలి: ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని చెప్పి వరి రైతులను నిలువునా ముంచేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండించిన ధాన్యాన్ని కొనేవారు లేక రైతులు రైతులు దిక్కులు చూస్తున్నారు. దేవుడు కరుణించినా పూజారి కరుణించలేదన్నట్లు ప్రకృతి సహకరించి మంచి దిగుబడులు వచ్చినా, ప్రభుత్వం వరిరైతులపై శీతకన్ను వేయటంతో ఎక్కడి ధాన్యం అక్కడే ఉండిపోయింది. ధాన్యాన్ని పట్టుకుని మిల్లుల దగ్గరకు వెళ్తే లక్ష్యాలు పూర్తి అయిపోయాయంటున్నారని, దీంతో ధాన్యాన్ని చేలల్లో, గట్లు, రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో నిల్వ చేసి ఉంచుతున్నామని తెలిపారు. ప్రభుత్వం ఎప్పుడు కరుణిస్తుందో, ఎప్పుడు ధాన్యం అమ్ముడవుతుందో తెలియటం లేదని, అప్పటి వరకు ధాన్యాన్ని కాపలా కాస్తున్నామని దీనంగా చెప్తున్నారు.

జిల్లాలో సాగు ఎంత

జిల్లాలో వరిసాగు 58 వేలహెక్టార్లలో సాగు చేయగా అధికారులు ఈ పంట నుంచి 5.5 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. ప్రభుత్వం రైతుల వద్ద నుంచి కేవలం 2.50 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దీనితో రోడ్డెక్కిన రైతన్నలను శాంతి పరచడానికి మరో లక్ష మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే జిల్లాలో ఈనెల 21వ తేదీ వరకు 3.35 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశారు. దీనిని బట్టి జిల్లాలో ఇంకా 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలి. ఒక్క పెరవలి మండలంలోనే 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ముక్కామల, ఖండవల్లి, పెరవలి, నల్లాకులవారిపాలెం గ్రామాల్లో నిల్వలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. అధికారులు కూడ 3500 టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అనుమతులు వచ్చిన వెంటనే కొనుగోలు చేస్తామని చెప్తున్నారు.

నియోజకవర్గంలో సాగు ఎంత

నియోజకవర్గంలో వరి ఈ ఏడాది 36 వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం రైతుల నుంచి ఈ రెండు మండల్లాలో 80 శాతం ధాన్యం సేకరించారు. మిగిలిన 20 శాతం ధాన్యం సేకరణకు అనుమతులు లేకపోవటంతో రైతులు అల్లాడిపోతున్నారు. కడుపు మండిన కొత్తపల్లి, పెరవలి రైతులు రాస్తారాకో చేస్తే మంత్రి కందుల దుర్గేష్ చొరవ తీసుకుని జిల్లా అధికారులను సంప్రదించి ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించటంతో కేవలం 500 మెట్రిక్ టన్నులు, ఆ తరువాత మరో వెయ్యి మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించి చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం పెరవలి మండలంలో 5 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం నిల్వ ఉందని రైతులు చెప్తుండగా అధికారులు మాత్రం 3,500 వేల మెట్రిక్ టన్నులు ఉందని చెప్తున్నారు. ఈ ధాన్యాన్ని ఎప్పటికి సేకరిస్తారో తెలియటం లేదని రైతులు వాపోతున్నారు.

దళారుల దాష్టీకం

పంట పండినా రైతులకు మాత్రం కలిసి వచ్చే పరిస్థితి లేదు. ఎందుకంటే ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ ప్రకారం ధాన్యం సేకరణ పూర్తి కావడంతో మిల్లర్లు ధాన్యం వైపు చూడటం లేదు. దళారీలను సంప్రదిస్తే అయిన కాడికి అడగటంతో రైతులు విస్తుపోతున్నారు. ప్రస్తుతం ధాన్యం చేల గట్లు, రోడ్లపై నిల్వలుగా పేరుకుపోయి ఉన్నాయి.

ధాన్యం రోడ్డు పక్కనే ఉంచాం



గత ప్రభుత్వంలో ధాన్యం సేకరణ వేగంగా జరిగినా సొమ్ములు రావటం ఆలస్యమయ్యేది. నేడు అసలు ధాన్యం మాకు వద్దంటే మేము ఏం చేయాలో తెలియటం లేదు. దళారీలు అయిన కాడికి అడుగుతున్నారు. ధాన్యం రోడ్డు పక్కనే రాశులు చేసి ఉంచాం.

– పిల్లా శ్రీనివాస్, వరి రైతు, కొత్తపల్లి అగ్రహారం

ప్రభుత్వం ఆదుకోవాలి



2 ఎకరాల్లో వరిసాగు చేశాను, దిగుబడి 55 బస్తాలు వచ్చింది, ధాన్యం తీసుకువెళితే వద్దంటున్నారు. పండిన ధాన్యం చూసి ఆనందించాలో లేక కొనుగోలు చేయటం లేదని బాధపడాలో తెలియడం లేదు. ప్రభుత్వం ఆదుకోకపోతే వరి రైతులు ఆత్మహత్యలు చేసుకోవలిసిందే.

– లొల్ల దానయ్య, కౌలు రైతు, పెరవలి

అనుమతుల కోసం చూస్తున్నాం



మండలంలో వరికోతలు పూర్తయ్యాయి. ధాన్యం 3,500 మెట్రిక్ టన్నులు సేకరిస్తే సరిపోతుంది. ధాన్యం కొనుగోలుకు అనుమతుల కోసం వేచి చూస్తున్నాం.

– మేరీ కిరణ్, వ్యవసాధికారి, పెరవలి

దాసాంజనేయునికి భక్త నీరాజనం


పెరవలిలో లక్ష తమలపాకుల పూజ చేస్తున్న పండితులు


బ్రాహ్మణగూడెంలో పూజలు చేస్తున్న అర్చకులు


కొవ్వూరు మెరకవీధిలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పెరవలి: స్థానిక అభయాంజనేయ జయంత్యుత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. భక్తులు లక్ష తమలపాకుల పూజ, గంధసిందూరంతో అర్చన చేశారు. 35 అడుగుల స్వామి వారి పాదాల వద్ద తమలపాకుల పూజ, ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేశారు. సాయంత్రం చిన్నారులు కోలాటం ఆడారు. ఖండవల్లిలోని భక్తాంజనేయుడు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మండలంలోని కానూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, అన్నవరప్పాడు, కడింపాడు, మల్లేశ్వరం, ముక్కామల గ్రామాల్లో జయంత్యుత్సవాలు ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద భజనలు, ఏకాహం నిర్వహించారు. కాగా పలు గ్రామాల్లోని స్వామివార్లను మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు దర్శించుకోగా, ఆలయ వర్గాలు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికాయి.

తాళ్లపూడిలో..

తాళ్లపూడి: మండలంలోని గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేగేశ్వరపురంలోని అభయాంజనేయునికి అర్చకులు పెరవలి సాయి ఆధ్వర్యంలో సిందూర పూజ, తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరంలో పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించి గోదావరి వద్ద ఉత్సవ మూర్తులకు పూజలు చేసి నదీ జలాలతో అభిషేకాలు, హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ప్రక్కిలంకలోని భక్తాంజనేయ ఆలయం వద్ద స్వామివారికి పంచామృత అభిషేకాలు చేశారు. అలాగే మలకపల్లి కొత్తపేట వద్ద గల స్వామివారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. తాళ్లపూడి, అన్నదేవరపేట తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి నిర్వహించారు.

కొవ్వూరులో..

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు మండలంలోని గ్రామాల్లో, పట్టణంలోని పలు చోట్ల హనుమజ్జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాలు పచ్చని పందిళ్లతో కళకళలాడాయి. కొవ్వూరు పట్టణంలోని మెరకవీధిలో, బసివిరెడ్డి వీధిలో, గోష్పాదక్షేత్రం వద్ద, బస్టాండ్ సెంటర్ వద్ద ఆలయాల్లో స్వామివారికి తులసిదళ మాలలు, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి ఇష్టమైన అప్పాలు తదితర పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. తెల్లవారుజాము నుంచి స్వామివారి ఆలయాలు హనుమ నామాలతో మార్మోగాయి. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పంచామృత అభిషేకాలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: మండలంలోని అంజనేయ ఆలయాల్లో హనుమజ్జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పాలంగిలో శ్రీ బాల భక్తాంజనేయ స్వామివారికి తెల్లవారుజాయున గంధ సిందూరం, తమలపాకులతో అభిషేకించి స్వామి వారిని విశేషంగా ఆలకరించారు. ఉండ్రాజవరంలో భక్త అంజనేయ స్వామి, తాడిపర్రు రోడ్డులోని శ్రీపంచముఖి అంజనేయ స్వామి, మోర్తలో దక్షిణ ముఖ అంజనేయ స్వామి, వెలగదుర్రులో క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు, అభిషేకాలు, అన్న సమారాధనలు నిర్వహించారు. కె.సావరంలో హోమాలు చేశారు. వేలివెన్ను, తాడిపర్రు, చివటం, వడ్లూరు తదితర గ్రామాల్లో అంజనేయస్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, హోమాలు, పూజలతో పాటు హనుమాన్ చాలీసా పఠించారు.

బ్రాహ్మణగూడెంలో..

చాగల్లు: మండలంలో హనుమజ్జయంతిని వైభవంగా నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్‌లోని స్వామివారి విగ్రహం ఆవరణలోని ఆలయంలో, బ్రాహ్మణగూడెంలోని బీసీ కాలనీలో ఉన్న హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఊనగట్ల, ఎస్.ముప్పవరం తదితర గ్రామాల్లోనూ ఘనంగా హనుమంతునికి పూజలు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


పడమర చోడవరంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ హోంమంత్రి వనిత

- మాజీ మంత్రి వనిత
- నాయకులు, కార్యకర్తలతో భేటీ

నల్లజర్ల: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలకు తానెప్పుడు అందుబాటులో ఉంటానని మాజీ హోంమంత్రి, గోపాలపురం వైఎస్సార్ సీపీ కన్వీనర్ తానేటి వనిత భరోసా ఇచ్చారు. గురువారం మండలంలోని తూర్పు, పడమర చోడవరం గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో ఆమె భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ గ్రామంలోనైనా మనస్పర్థలు ఉంటే మనస్సులో పెట్టుకోకుండా తమదృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. చెప్పుడు మాటలు వినే స్వభావం తనది కాదని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు చెప్పారు. గ్రామాలలో నాయకులు, కార్యకర్తలు రాబోయే అన్నిరకాల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. రెండు గ్రామాలలో పార్టీ పరిస్థితిపై నాయకులతో సమీక్షించారు. ఆమె వెంట మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రమణ్యం, మాజీ జెడ్పీటీసీ బంక అప్పారావు, భోగవల్లి రాజ్యలక్ష్మి, శ్రీరామారావు, గన్నమని సుబ్బారావు, నిమ్మకాయల శేషారావు, కసుకుర్తి కృష్ణారావు తదితరులున్నారు.

వరుడికి శుభాకాంక్షలు


మణికంఠకు శుభాకాంక్షలు చెప్తున్న తానేటి వనిత, శ్రీనివాస్‌నాయుడు, తలారి వెంకట్రావు

నిడదవోలు రూరల్: మండలంలోని సూరాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వద్దిరెడ్డి రాంబాబు కుమారుడు వెంకట మణికంఠ వివాహానికి మాజీ హోంమంత్రి తానేటి వనిత, నిడదవోలు, గోపాలపురం మాజీ ఎమ్మెల్యేలు జి.శ్రీనివాస్‌నాయుడు, తలారి వెంకట్రావులు హాజరైయ్యారు. వరుడు మణికంఠకు వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులతో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, గ్రామ అధ్యక్షుడు వద్దిరెడ్డి శ్రీను, నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, సుంకవల్లి శ్రీహరి, కోలా రామారావు, యాళ్ల రామారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భారతీయ స్టేట్ బ్యాంక్ | రీజనల్ ఆఫీస్, తాడేపల్లిగూడెం

బంగారు నగల వేలం ప్రకటన

[illegible] తేది.30-05-2025, శుక్రవారం మధ్యాహ్నం 3.00 గం.లకు వేలం వేయుటకు నిర్ణయించడమైనది.

క్ర. సం.	ఖాతా నెంబర్	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	బంగారు గ్రాములలో	బకాయి రూ.లలో
		వేలం జరుగు ప్రదేశం: భారతీయ స్టేట్ బ్యాంక్, ఏపిబి నల్లజర్ల బ్రాంచ్		
1	41283605000	[illegible]	27.6	88708/-
		వేలం జరుగు ప్రదేశం: భారతీయ స్టేట్ బ్యాంక్, [illegible] బ్రాంచ్		
1	43079719003	[illegible]	128.1	470000/-
		వేలం జరుగు ప్రదేశం: భారతీయ స్టేట్ బ్యాంక్, గోపాలపురం బ్రాంచ్		
1	41307536721	[illegible]	8.6	24073/-
2	41368474093	[illegible]	15.8	40000/-
		వేలం జరుగు ప్రదేశం: భారతీయ స్టేట్ బ్యాంక్, [illegible] బ్రాంచ్		
1	42387497554	[illegible]	21.2	80000/-

షరతులు–నిబంధనలు: 1) వేలం నందు పాల్గొనదలచినవారు రూ.5,000/- [illegible] 2) [illegible] 3) [illegible] 4) [illegible] 5) [illegible] 6) [illegible]

తేది: 22.05.2025 సం/- రీజనల్ మేనేజర్, తాడేపల్లిగూడెం

ఉద్యానసాగుపై దృష్టి పెట్టండి


సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానశాఖాధికారి బబిత

- వరి విస్తీర్ణం తగ్గించండి
- ఆయిల్‌పామ్ వేస్తే ఉచితంగా మొక్కలు
- నాలుగేళ్లపాటు రూ.5200 విలువైన ఎరువులు
- రైతులకు ఉద్యానాధికారి బబిత పిలుపు

నల్లజర్ల: రైతులు వరి విస్తీర్ణం తగ్గించి ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని ఉద్యానశాఖాధికారి ఎం.బబిత సూచించారు. గురువారం నల్లజర్లలో త్రీఎఫ్ ఆయిల్ పామ్, ఉద్యానశాఖల ఆధ్వర్యంలో రైతుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఏటా వెయ్యి ఎకరాలలో ఉద్యానసాగు చేపట్టడానికి ప్రభుత్వం సాయం అందజేస్తోందన్నారు. రైతులకు ఆయిల్‌పామ్ వేసుకుంటే ఉచితంగా మొక్కలు అందించడంతో పాటు నాలుగేళ్ల పాటు రూ.5,200 విలువగల ఎరువులు, అంతర పంటలు వేసుకుంటే ఉద్యానశాఖ రూ.5,250 సబ్సిడీగా ఇస్తుందన్నారు. యంత్ర పరికరాలు, గెలల కోత గెడలు సబ్సిడీపై అందిస్తున్నట్టు చెప్పారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటలుగా కోకో, మిరియాలు, దాల్చిన చెక్క, జాజికాయ, జాపత్రి వంటి సుగంధద్రవ్యాలు ఆవకాడో వంటి పండ్లు సాగుచేసుకోవచ్చునన్నారు. ఇందుకు ఉద్యానశాఖ సహాయం అందజేస్తుందన్నారు. త్రీఎఫ్ సంస్థ డీజీఎం సూర్యారావు మాట్లాడుతూ రైతులకు ఫెర్టిలైజర్ అప్లికేషన్, డ్రిప్ ద్వారా ఎరువుల వినియోగాన్ని వివరించారు. ఆకులు కట్టడం వల్ల, గానోడెర్మా తెగులు నివారణ గురించి వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

చాగల్లు/నిడదవోలు రూరల్/దేవరపల్లి: విద్యుత మరమ్మతుల నేపథ్యంలో చాగల్లు, నిడదవోలు రూరల్, దేవరపల్లి మండలాల్లో పలుచోట్ల శుక్రవారం విద్యుత సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు చాగల్లు మండలంలో చంద్రవరం, మార్కొండపాడు, గౌరిపల్లి, మల్లవరం తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

అలాగే నిడదవోలు పట్టణ పరిధిలో పాటిమీద, గణపతి సెంటర్, ప్రభుత్వాసుపత్రి, యర్నగూడెం రోడ్, వైఎస్సార్ కాలనీ ప్రాంతాలతో పాటు కోరుమామిడి అగ్రికల్చరల్ విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల పరిధిలోని గృహ, వాణిజ్య వినియోగదారులంతా ఇందుకు సహకరించాలని ఆయన కోరారు.

అలాగే దేవరపల్లి మండలంలోని బుచ్చియపాలెం, అచ్చియపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ వివరించారు. రామన్నపాలెం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బుచ్చియపాలెం ఫీడర్ ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, యర్నగూడెం 33/11 కేవీ గాంధీనగరం ఫీడర్‌లో చెట్ల కొమ్మల కొట్టివేత నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు యర్నగూడెం, గాంధీనగరం గ్రామాల్లోని వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ తెలిపారు. ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 వరకు వ్యవసాయానికి సరఫరా ఉటుందని అసౌకర్యానికి సహకరించాలని ఆయన కోరారు.

కౌన్సిల్ సమావేశానికి తరలండి

- ఉద్యోగులకు ఏపీ జీఈఏ కమిటీ కార్యదర్శి కాట్రురాజు పిలుపు


చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

గోపాలపురం: విజయవాడలో వచ్చేనెల ఐదో తేదీన జరిగే 3వ కౌన్సిల్ సమావేశానికి ఉద్యోగులు తరలిరావాలని ఏపీజీఈఏ కమిటీ కార్యదర్శి నల్ల కాట్రురాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నల్లరాజు మాట్లాడుతూ ఏపీ ఉద్యోగుల సమస్యలు, వాటి పరిష్కారాల నివేదనకు రాష్ట్ర ఉద్యోగులు చేపట్టిన చలో విజయవాడ కౌన్సిల్ సమావేశానికి ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.అజయ్‌బాబు, మండల సర్వేయర్ ఎం.తులసి రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

సరస్వతి పుష్కరాలకు రెండు బస్సులు


పుష్కరాలకు బయలుదేరుతున్న బస్సులు

రాజమహేంద్రవరం సిటీ: కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు గురువారం రాజమహేంద్రవరం డిపో నుంచి రెండు సూపర్ లగ్జరీ బస్సులు భక్తులతో బయలుదేరాయి. వీటిని డిపో మేనేజర్ షేక్ షబ్బం జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ బస్సులు ధర్మపురి, కాళేశ్వరం, కొండగట్టు, వేములవాడ, వరంగల్, రామప్ప క్షేత్రాలను దర్శించిన అనంతరం 25వ తేదీన డిపోకు చేరుకుంటాయన్నారు.

